# దిగులెందుకు?

ఒకదేశంలో సైన్యం కవాతుచేసేముందు శిక్షకుడు ఈ విధముగా చెబుతూవుంటే తక్కినవారు వల్లిస్తూ ఉండేవారు :

దిగులెందుకు ? రెండింటిలో ఏదో ఒకటి జరుగుతుంది. నిన్ను యుద్ధభూమికి పంపనైనా పంపుతారు. లేకపోతే పంపరు యుద్ధభూమికి పంపకపోతే దిగులేలేదు.

ఒకవేళ యుద్ధభూమికి పంపిస్తే మళ్ళీ రెండింటిలో ఏదో ఒకటి తప్పదు. సైన్యం ముందు వరుసలోనయినా ఉంటావు. లేకపోతే వెనుక వరుసలోనయినా ఉంటావు. వెనుక వరుసలో ఉంటే దిగులే లేదు.

ఒకవేళ ముందువరుసలో ఉంటే మళ్ళీ రెండింటిలో ఏదో ఒకటి తప్పదు. ప్రమాదం జరిగేచోటనయినా వుంటావు. లేకపోతే సురక్షితమైన చోటనయినా ఉంటావు. సురక్షితమైనచోట ఉంటే దిగులేలేదు.

ఒకవేళ ప్రమాదం జరిగేచోట ఉంటే మళ్ళీ రెండింటిలో ఏదోఒకటి తప్పదు. తీవ్రంగానైనా గాయపడతావు లేకపోతే కొద్దిపాటి గాయలైనా తగులుతాయి కొద్దిపాటి గాయాలు తగిలితే దిగులేలేదు.

ఒకవేళ తీవ్రమయిన గాయాలు తగిలితే మళ్ళీ రెండింటిలో ఏదోఒకటి ఖాయం. గాయాలు నయమైనా అవుతాయి లేకపోతే గాయాలు నయంకాక, చస్తావు.

గాయాలు నయమైతే దిగులేలేదు. ఇక చస్తే ఎలానూ దిగులు పడలేవుకదా. కాబట్టి దిగులెందుకు ?

---

వి. వి. యస్. రామదాసు

---